


**అమృత్ తెలంగాణ**

తెలుగు దిన పత్రిక




సంపుటి: 01 సంచిక : 271. ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ మంగళవారం.15.07.2025 పేజీలు:4, వెల:రూ.1.00

# కృష్ణా, గోదావరి జలాల్లో ప్రతి నీటిబొట్టునూ




, హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలనీ, న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలనీ, నీటి కేటాయింపులతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నారు. కృష్ణాతోపాటు గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించుకోవటంతో పాటు, ఇంతకాలం జరిగిన అన్యాయానికి శాశ్వతమైన పరిష్కారాలను సాధించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం సూచనలతో కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి లేఖ రాశారు. ఈనెల 16న ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రితో సమావేశమై తెలంగాణ నీటి వాటాల సాధనతో పాటు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పట్టుబట్టాలని నిర్ణయించారు. కృష్ణానదీ జలాల వినియోగంలో ఇంతకాలం తెలంగాణకు తీరని ద్రోహం జరిగిందని అభిప్రాయపడ్డారు. గడిచిన పదేండ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైందని పేర్కొన్నారు. తెలంగాణకు 299 టీఎంసీలు మాత్రమే నీటి వాటాకు అంగీకరించి ఏపీకి 512 టీఎంసీలు కట్టబెట్టిందన్నారు. శ్రీశైలం ఎగువన ఏపీ అక్రమంగా నిర్మించుకున్న ప్రాజెక్టులన్నింటికీ వంత పాడి, కృష్ణా నీళ్లను ఏపీ యథేచ్ఛగా మళ్లించుకుంటే మౌనం వహించిందని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కష్ణాపై నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఇవ్వకుండా అసంపూర్తిగా వదిలేసిందని తెలిపారు. అటు గోదావరిపై తుమ్మిడిహెట్టిపై చేపట్టిన ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత పక్కనబెట్టిందని విమర్శించారు. దానికి బదులు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రూ. లక్ష కోట్లకు పైగా ప్రజాధనం దుర్వినియోగం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

# గిరిజన గురుకులాల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: గిరిజన గురుకుల విద్యాసంస్థలో మిగిలిపోయిన సీట్లను త్వరగా భర్తీ చేసేందుకు గిరిజన గురుకుల సంస్థకు అనుమతివ్వాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు గిరిజన సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య అంజయ్య నాయక్, గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం బాలు నాయక్, గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నేనావత్ రూప్ సింగ్, నాయకులు ఇస్లావత్ శ్రీను నాయక్ వినతి పత్రాన్ని సమర్పించారు. రూ.154 కోట్ల బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను విడుదల చేయాలనీ, అంబేద్కర్ విద్యా నిధి పథకంలో విదేశీ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల లిస్టును తక్షణం ఆమోదించాలని కోరారు. గిరిజన గురుకుల విద్యాసంస్థ మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న సంక్షేమ గురుకుల కార్యదర్శి అలగు వర్షిణి వ్యవహార శైలిని కట్టడి చేయాలని కోరారు. గురుకులాల సెట్ కన్వీనర్ గా వ్యవహరించిన ఆమే గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో మిగిలిన వేలాది సీట్లను భర్తీ చేసుకోవడానికి గిరిజన గురుకుల విద్యాసంస్థకు బదిలీ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గురుకులాల్లో సీట్లు రానివారు, పరీక్ష రాయని వారు వందలాదిమంది విద్యార్థులు,వారి తల్లిదండ్రులు గిరిజన గురుకుల సంస్థకు వచ్చి పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. మంత్రి స్పందిస్తూ బెస్ట్ అవైల్‌బుల్ పథకం బకాయిలను, సీఎం వద్ద ఉన్న అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకంలోని విద్యార్థుల లిస్టుకు సంబంధించిన సమస్యలను పరిష్కారం చేసేందుకు తగిన కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయి



బేగంపేట్ :అమృత్ తెలంగాణ: 'ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయి.. పాడి పంటలు సమృద్ధిగా పండుతాయి.. కానీ రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుంది.. అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయి.. జాగ్రత్తగా ఉండాలి' అని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. అలాగే 'నాకు పూజలు చేసి రక్తం చూపించండి' అని అన్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు వైభవోపేతంగా కొనసాగాయి.. రెండో రోజు సోమవారం వేడుకల్లో ప్రధాన ఘట్టమైన 'రంగం' కార్యక్రమం జరిగింది. పచ్చి కుండపై నిలబడి మాతంగి స్వర్ణలత ఎప్పటిలాగే భవిష్యవాణి వినిపించారు. మహంకాళి బోనాల ఉత్సవంతో సంతృప్తి చెందావా తల్లీ?.. అని అర్చకులు ఆమెను అడగ్గా.. 'ప్రజలంతా డప్పు చప్పుళ్లతో ఆనందోత్సాహాల నడుమ తనకు బోనాలు సమర్పించారు. వచ్చిన ప్రతి బోనాన్నీ సంతోషంగా అందుకున్నాను. మీ అందరినీ సంతోషంగా సమానంగా చూస్తాను. కాలం తీరితే ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారు.. నేను అడ్డు రాను. బాలబాలికలను విచ్చలవిడిగా వదిలేస్తున్నారు.. కానీ నేను కడుపులో పెట్టుకుని కాచుకుంటున్నాను. ప్రతి ఏటా ఉత్సవానికి ఏదో ఒక ఆటంకం కల్పిస్తున్నారు.. నన్ను ఎవరూ లెక్కచేయడం లేదు' అని ఆగ్రహించారు. 'రాశులకొద్దీ రప్పించుకుంటున్నారు.. గోరంతైనా తనకు దక్కడం లేదు.. సక్రమంగా పూజలు చేయడం లేదు.. అయినా నేను అందరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నా' అని అన్నారు. 'జరుగుతున్న పరిణామాల్లో నా పాత్ర ఉంటుంది.. నా రూపాన్ని పెట్టడానికి కూడా అడ్డుపడుతున్నారు.. నాకు ఎవరైతే ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తారో వాళ్లు రక్తం కక్కుకుంటారు. నాకు పూజలు చేసి రక్తం చూపించండి.. ఏటికొక్కసారి నాకు ఇలా పూజలు జరిపించాలి. నన్ను కొలిచే నా అక్కచెల్లెలు అందరికీ అండదండగా ఉంటాను' అని అన్నారు.తర్వాత మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ మహంకాళి బోనాల జాతర బాగా జరిగిందని తెలిపారు. ప్రతి ఏడాది కంటే ఈసారి ఎక్కువ మంది వచ్చారని.. అమ్మవారికి జరగాల్సిన అన్ని పూజలూ ప్రభుత్వం పక్షాన చేస్తామని చెప్పారు. అమ్మవారు కోరుకున్నట్టు బలి విషయంలో ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు తప్పనిసరి చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరిచందన దాసరి, అధికారులు పాల్గొన్నారు. అనంతరం పోతురాజుల విన్యాసాలు మేళతాళాలతో అంబారీ ఊరేగింపు ఘనంగా సాగింది.

# తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా అపరేష్ కుమార్ సింగ్



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా అపరేష్ కుమార్ సింగ్ నియమితు లయ్యారు. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు సీజేగా సేవలందిస్తోన్న జస్టిస్ అపరేష్ కుమార్ బదిలీపై తెలంగాణకు హైకోర్టుకు రానున్నారు. ఈ మేరకు సోమవారం దేశంలోని ఐదు రాష్ట్రాలకు సీజేల నియామకం, నాలుగు రాష్ట్రాలకు సీజేల బదిలీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. తాజాగా మొత్తం 9 రాష్ట్రాలకు సీజేల నియామకం/ బదిలీలకు సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియ ం సిఫారసులను రాజ్యాంగం కల్పించిన అధికారాలతో రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్టు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘావాల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. సీజేల నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసినట్టు తెలిపారు. అందులో భాగంగా జస్టిస్ మణింద్ర మోహన్ శ్రీవాస్తవను రాజస్థాన్ నుంచి మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను త్రిపుర నుంచి తెలంగాణ హైకోర్టుకు, జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావును జార?ండ్ నుంచి త్రిపురకు, జస్టిస్ కెఆర్ శ్రీరాంను మద్రాస్ నుంచి రాజస్థాన్‌కు బదిలీ అయ్యారు. అలాగే మధ్యప్రదేశ్ యాక్టింగ్ సీజే జస్టిస్ సంజీవ్ సచ్ దేవ్ ఆ రాష్ట్రానికి సీజేగా, ఢిల్లీ హైకోర్టు జడ్జీ జస్టిస్ విభు బక్రూ.. కర్ణాటక సీజేగా, పాట్నా హైకోర్టు యాక్టింగ్ సీజే జస్టిస్ అశుతోష్ కుమార్..గౌహతి సీజేగా, పాట్నా జడ్జీ జస్టిస్ విపుల్ మనుభారు పంటోలిని..పాట్నా సీజేగా, హిమాచల్ ప్రదేశ్ జడ్జీ జస్టిస్ టీఎస్ చౌహాన్..జార?ండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# జలవివాదాలపై కేంద్రం స్పందించాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు, కృష్ణా, గోదావరి నదీ బేసిన్ల సమస్యలపై కేంద్రం వెంటనే చొరవ చూపాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఆయన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి లేఖ ద్వారా ఆయా అంశాలను తీసుకెళ్లారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు ఇప్పటికీ క్లియరెన్స్ రాలేదని గుర్తు చేశారు.

45 టీఎంసీలను వినియోగించుకోవాలి

పాలమూరుకు మైనర్ ఇరిగేషన్ కాంపోనెంట్ నుంచి 45 టీఎంసీల మిగులు జలాలు, గోదావరి నీటిని కృష్ణా నదికి బదిలీ చేయడం ద్వారా తెలంగాణకు రావాల్సిన 45 టీఏంసీలను ఈ ప్రాజెక్టు వినియోగించుకోవాలని ప్రతిపాదించిందని అందులో చెప్పారు. గోదావరి వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) అవార్డు ప్రకారం 45 టీఎంసీల కృష్ణా నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌పై వాడుకునే వీలుందని వివరించారు. ఆ నీటినే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించిందని గుర్తు చేశారు. పాలమూరు, డిండి ప్రాజెక్టుల డీపీఆర్‌లను కేంద్ర జల సంఘం ఆమోదించాలనీ, ఆ తర్వాత పర్యావరణ శాఖ సీసీ, ఈసీ జారీ చేయమని సిఫారసు చేయాలని కోరారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం కారణంగా కరువు పీడిత ప్రాంతాల రైతులకు ఆశించిన ప్రయోజనాలు అందడం లేదన్నారు. ఈ ప్రాజెక్టులకు ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ వస్తే కేంద్రం నుంచి గ్రాంట్లు, ఆర్థిక సాయంతో పాటు నాబార్డ్ లాంటి ఆర్థిక సంస్థల నుంచి తక్కువ వడ్డీతో రుణాలు పొందే వీలుంటుందని తెలిపారు.

తెలంగాణకు ముందే

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే 2007లోనే డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఆమోదం పొందిందనీ. ఫ్లోరోసిస్ సమస్యను పరిష్కరించే లక్ష్యంతో డిండి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా పరిగణించాలని ప్రధాన మంత్రి కార్యాలయం 2010 డిసెంబర్ 10వ తేదీన ప్రతిపాదించిందని మంత్రి ఉత్తమ్ లేఖలో వివరించారు. 2021 సెప్టెంబర్ 21న కేంద్ర జలసంఘానికి సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ (తుపాకులగూడెం బ్యారేజ్) డీపీఆర్ సమర్పించిందన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి నో-అబ్జెక్షన్(ఎన్‌వోసీ) లేనందున ఇంటర్-స్టేట్ మ్యాటర్స్ డైరెక్టరేట్ నుంచి క్లియరెన్స్ ఆలస్యమవుతున్నదన్నారు. ఛత్తీస్‌గఢ్ సూచనలను, నిబంధనల ప్రకారం అక్కడి భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించేందుకు, ముంపు విషయంలో ఖరగ్‌పూర్ ఐఐటీ ఇచ్చిన నివేదికలోని సిఫారసులను పాటించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

కృష్ణా బేసిన్‌లో

కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు ఏపీ అక్రమంగా నీటిని మళ్లిస్తున్నదనీ, శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 880 అడుగుల వద్ద 1.5 లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువ సామర్థ్యంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని మళ్లిస్తోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఏకంగా 841 అడుగుల నుంచి రోజుకు 8 టీఎంసీల నీటిని మళ్లించేలా ఏపీ కాల్వల నిర్మాణాలు చేపట్టిందని లేఖలో పేర్కొన్నారు. 797 అడుగుల వద్ద రోజుకు 3 టీఎంసీలు తీసుకెళ్లే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌తోపాటు ముచ్చుమర్రి, మలయాల, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులు నిర్మించిందన్నారు. కృష్ణా నది నుంచి వరద నీటిని బేసిన్ వెలుపల ప్రాంతాలకు మళ్లిస్తున్నదని గుర్తు చేశారు. శ్రీశైలం అట్టడుగు నుంచి నీటిని డైవర్ట్ చేసే నిర్మాణాలతో రిజర్వాయర్ ఖాళీ అవుతున్నదని వివరించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ మీద ఆధారపడ్డ జల విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతున్నదనీ, రోజుకు 10 టీఎంసీల చొప్పున 20 రోజులలో 200 టీఎంసీలు డైవర్ట్ చేసే సామర్థ్యముండటంతో తెలంగాణలోని ఇన్-బేసిన్ అవసరాలకు విఘాతం కలుగుతున్నదని వివరించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావానికి ముందే కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో 287.06 టీఎంసీల సామర్థ్యంతో వివిధ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయనీ, కేడబ్ల్యూడీటీ 2 ముందు ఈ వాదనలను వినిపించామనీ, ఈ విచారణ త్వరగా పూర్తి కావాలని కోరారు. 1979లో ఎస్ఎల్‌బీసీ 1984లో మొదలైన కల్వకుర్తి, 1997లో నెట్టెంపాడు, 2013లో పాలమూరు-రంగారెడ్డి, 2007లో డిండి, 2005లో కొల్లాపూర్, 2014లో నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని వివరించారు.

కేడబ్ల్యూడీటీ 2 అవార్డు ప్రకారం..

కేడబ్ల్యూడీటీ 2 అవార్డు ప్రకారం చేపట్టిన ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం అనుమతులివ్వాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర బేసిన్లకు నీటిని మళ్లించడాన్ని కేఆర్ఎంబీ అడ్డుకోవాలనీ, కృష్ణా జలాల మళ్లింపుపై నియంత్రణలు విధించాలని ఆయన వివరించారు. ఇన్-బేసిన్ అవసరాల విషయంలో కేఆర్ఎంబీ న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. నీటి ప్రవాహాలను కచ్చితంగా లెక్కించేందుకు టెలిమెట్రీ అమలు చేయాలనీ, టెలిమెట్రీ అమలుకు తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీ ఖాతాకు రూ.4.15 కోట్లు జమ చేసిందన్నారు. ఇప్పటికీ ఏపీ పరిధిలో టెలిమెట్రీ పనులు జరగలేదనీ, వీటిని వెంటనే ఏర్పాటు చేయాలని కేఆర్ఎంబీకి సూచించాలని తెలిపారు. ఏపీ ప్రభుత్వం తుంగభద్ర నీటిని కేసీ కెనాల్ నుంచి హెచ్ఎల్సీ, ఎల్ఎల్సీ కెనాల్‌కు నీటిని డైవర్ట్ చేస్తోందనీ, ఇది కేడబ్ల్యూడీటీ 2 అవార్డును ఉల్లంఘించటమే అవుతుందని అన్నారు. అవార్డు ప్రకారం తుంగభద్ర నుంచి వచ్చే ప్రవాహాలు కష్ణా నదికి రావాలనీ, దానికి విరుద్ధంగా ఏపీ అనుసరిస్తున్న తీరుపై ఇప్పటికే తుంగభద్ర బోర్డుకు లేఖలు రాశామని మంత్రి ఉత్తమ్ వివరించారు. శ్రీశైలం రిజర్వాయర్ అడుగు నుంచి (797 అడుగుల వద్ద) రోజుకు 3 టీఎంసీల నీటిని అవతల బేసిన్‌కు లిఫ్ట్ చేసేలా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును ఏపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఎన్జీటీ స్టే ఇచ్చినా పనులు కొనసాగుతున్నాయనీ, పనులు ప్రారంభమయ్యే ముందు పూర్వస్థితికి పునరుద్ధరించాలని ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలు అమలయ్యేలా చూడాలని వివరించారు.

అనధికారికంగా

శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ డిశ్చార్జ్ కెపాసిటీని అనధికారికంగా పెంచుకుందనీ, 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని తరలించుకునేలా ఏర్పాట్లు చేసుకుందని మంత్రి వివరించారు. 44 వేల క్యూసెక్కుల సామర్థ్యమున్న ఈ కెనాల్‌కు ఇటీవల 89 వేల క్యూసెక్కులకు పెంచుకుందని చెప్పారు. శ్రీశైలం డ్యామ్ నిర్వహణ ప్రమాదకరంగా మారిందనీ, తెలంగాణ ప్రభుత్వం పదే పదే ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ ప్లంజ్ పూల్‌కు మరమ్మతులు చేపట్ట లేదన్నారు. గత 6-7 సంవత్సరాలలో డ్యామ్ సైట్‌ను సందర్శించిన వివిధ నిపుణుల బందాలు చేసిన హెచ్చరికలు పట్టించుకోలేదనీ, డ్యామ్ భద్రత, నిరంతర కార్యకలాపాలు, జల విద్యుత్తు ఉత్పత్తి, నీటిపారుదల అవసరాలు, తాగునీటి సరఫరాకు తక్షణ చర్యలు చేపట్టాలని వివరించారు.

శ్రీశైలం రిజర్వాయర్ నుంచి భారీ మొత్తంలో నీటిని మళ్లించేలా ఏపీ నిర్మించుకున్న ప్రాజెక్టులతో విద్యుత్తు ఉత్పత్తిపై ప్రభావం పడుతున్నదనీ, నాగార్జునసాగర్, కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్బీసీ ఆయకట్టుకు నీటి కొరతతో పాటు శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలలో గ్రీన్ పవర్ ఉత్పత్తి తగ్గిపోతున్నదని తెలిపారు. 2007లో కేంద్ర ప్రభుత్వం ఏఐబీపీ సాయంతో తెలంగాణకు జీవనాడిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్ట్ చేపట్టిందనీ, ఆదిలాబాద్‌లో తుమ్మిడిహెట్టి నుంచి 160 టీఎంసీల నీటిని ఏడు ఉమ్మడి జిల్లాల్లో 16.40 లక్షల ఎకరాల ఆయకట్టుతో పాటు తాగునీటిని అందించేందుకు ప్రతిపాదించిందని అభిప్రాయపడ్డారు.

2010లోనే అనుమతి..

2010లోనే కేంద్ర జలసంఘం ఈ ప్రాజెక్టుకు అనుమతించిందనీ, 2016లో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఒప్పందం కుదిరిందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. ఇప్పుడున్న 20 టీఎంసీల కేటాయింపులను 80 టీఎంసీలకు పెంచాలనీ, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల వాటాలో నుంచి 80 టీఎంసీలు ఈ ప్రాజెక్టుకు సర్దుబాటు చేయాలనీ, ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఏఐబీపీ కింద ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

నదుల అనుసంధానం

జాతీయ నదుల అనుసంధాన ప్రణాళికలో భాగంగా ఇచ్చంపల్లి కావేరి లింక్ కెనాల్ ప్రతిపాదనలున్నాయి. ఇచ్చంపల్లి నుంచి కావేరికి 148 టీఎంసీల నీటి బదిలీలో 50 శాతం తెలంగాణకు ఇవ్వాలని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ 2024 మార్చిలో లేఖ రాసింది. గోదావరి బేసిన్ నుంచి ఇతర బేసిన్‌లకు నీటిని బదిలీ చేసే విషయంపై చర్చలు జరగాల్సిన అవసరముంది. తెలంగాణలోని కరువు పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అవసరాలు తీర్చేందుకు 200 టీఎంసీల వరద నీటిని ఉపయోగించుకునేలా ఇచ్చంపల్లి వద్ద కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించాలి. గోదావరిపై పోలవరం, ఇచ్చంపల్లి ప్రాజెక్టులు చేపట్టాలని జీడబ్ల్యూడీటీ పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు సమకూర్చుతున్నందున, అంతే సమానంగా ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు కేంద్రం నిధులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా అపరేష్ కుమార్ సింగ్

న్యూఢిల్లీ బ్యూరో : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా అపరేష్ కుమార్ సింగ్ నియమితు లయ్యారు. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు సీజేగా సేవలందిస్తోన్న జస్టిస్ అపరేష్ కుమార్ బదిలీపై తెలంగాణకు హైకోర్టుకు రానున్నారు. ఈ మేరకు సోమవారం దేశంలోని ఐదు రాష్ట్రాలకు సీజేల నియామకం, నాలుగు రాష్ట్రాలకు సీజేల బదిలీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. తాజాగా మొత్తం 9 రాష్ట్రాలకు సీజేల నియామకం/ బదిలీలకు సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియ ం సిఫారసులను రాజ్యాంగం కల్పించిన అధికారాలతో రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్టు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘావాల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. సీజేల నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసినట్టు తెలిపారు. అందులో భాగంగా జస్టిస్ మణింద్ర మోహన్ శ్రీవాస్తవను రాజస్థాన్ నుంచి మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను త్రిపుర నుంచి తెలంగాణ హైకోర్టుకు, జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావును జార?ండ్ నుంచి త్రిపురకు, జస్టిస్ కెఆర్ శ్రీరాంను మద్రాస్ నుంచి రాజస్థాన్‌కు బదిలీ అయ్యారు.

# ఉపాధి హామీ చట్టాన్ని సంరక్షించుకుందాం



అమృత్ తెలంగాణ : గ్రామీణ భారతంలో కుల, మత, లింగ బేధం లేకుండా అన్ని రకాల ప్రజలకు వారి జీవన హక్కులను బలోపేతం చేయడానికి 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (దాన్ని నరేగా అని కూడా పిలుస్తున్నారు) పార్లమెంటులో ఆమోదించబడి చట్టంగా తయారైంది. మొట్టమొదటి యుపిఏ ప్రభుత్వ కాలంలో వామపక్షాల సంపూర్ణ మద్దతుతో రూపొందించబడింది. 2014లో బిజెపి కేంద్రంలో అధికారం చేజిక్కించుకోగానే ఉపాధి చట్టానికి తూట్లు పొడవడం మొదలు పెట్టి దాని స్ఫూర్తిని నాశనం చేయడానికి చర్యలు చేపట్టింది. పార్లమెంటులో తయారైన శాసనానికి ఏ విధమైన చర్చ లేకుండా దానికి మార్పులు చేయడం ద్వారా చట్టం స్ఫూర్తినేకాక భారత ప్రజాస్వామ్య స్ఫూర్తిపై కూడా ఆ పార్టీ దాడి చేయడం ప్రారంభించింది.

ఉపాధిపై బిజెపి దాడి

అధికారంలోనికి వచ్చిన నాటి నుండి బిజెపి ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని నీరుగార్చుడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నది.

మొదటిది: మొట్టమొదట పథకం ప్రవేశ పెట్టినపుడు కేంద్ర బడ్జెట్లో నాలుగు శాతం నిధులు అంటే 2.5 లక్షల కోట్లు కేటాయించగా తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం 1.37 శాతం (రూ.86 వేల కోట్లు) మాత్రమే కేటాయించింది. అంతేకాక గతేడాది కేటాయింపుల కంటే ఈ సంవత్సరపు కేటాయింపులు పెరగకపోగా కేటాయించిన పూర్తి బడ్జెట్‌ను కూడా ఈ పథకానికి వినియోగించడంలో పూర్తిగా విఫలమైంది. చట్టం ప్రకారం రకరకాల కారణాలచేత కనీసం వంద పని దినాలు కల్పించడంలో విఫలమవుతుండగా బడ్జెట్ కేటాయింపులు ఈ పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయి. ఈ ఏడాది సగటున కల్పించిన పని దినాలు 50.23 కాగా గత ఆర్థిక సంవత్సరం ముందు అది 52.8 గా ఉంది. అంటే రానురానూ బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదనడంలో సందేహం లేదు.

రెండవది: నమోదైన కూలీల పేర్లు అర్ధాంతరంగా తొలగించడం. గత సంవత్సరానికి ముందు ఉపాధి పథకానికి 25.2 కోట్ల మంది నమోదు కాగా ఆధార్ ఆధారిత ధ్రువీకరణ తర్వాత ఆ సంఖ్య 18.28 కోట్లకు తగ్గింది. అంతమందినే ప్రభుత్వం ఈ పథకానికి అర్హులుగా నిర్ధారించింది. బిజెపి ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం ప్రవేశపెట్టిన నాటి నుండి ఈ పరిస్థితి నెలకొన్నది. ఒకపక్క గ్రామీణ భారతంలో కొన్నేళ్లుగా నిరుద్యోగం, ఉపాధి లేమి పెరుగుతుండగా ఉపాధి కల్పించే జాబు కార్డుల తొలగింపు కూడా పని దినాల తగ్గింపుకు దారితీసింది. 2020 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం 389.09 కోట్ల పనిదినాలు కల్పించగా గత ఆర్థిక సంవత్సరంలో కేవలం 286.26 కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించింది.

మూడవది: ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిన కొత్తలో దళిత ఆదివాసీల అసైన్డ్ భూములను అభివృద్ధిపరిచే పని బాగా ప్రోత్సహించడం జరిగింది. ఫలితంగా గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక పరిస్థితుల్లో కొంతమేరకు వృద్ధి కనబడింది. కాగా తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత భూములపై కాక పట్టణ ప్రాంత భూముల అభివృద్ధిపై దృష్టి సారించింది. గతంలో 65 శాతం నిధులు వ్యవసాయ లేదా దాని అనుబంధ కార్యకలాపాలకు వినియోగించితే నేడు అది 46.74 శాతానికి పడిపోయింది. మరొక ముఖ్యమైన డిమాండ్ ఉపాధి వ్యవసాయ పనులను అనుసంధానించడం. ఉపాధి పనులను పెంచడానికి బదులుగా బిజెపి ప్రభుత్వం గ్రామీణ నిరుపేద రైతు కూలీలను భూస్వాముల ధనికుల భూముల్లో పని చేయమని బలవంతం చేస్తున్నది. తద్వారా గ్రామీణ ధనవంతులతో రైతు కూలీల బేరసారాల శక్తి తగ్గిపోయింది పనిదినాల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఉపాధి చట్టానికి మరిన్ని తూట్లు పొడుస్తూ బిజెపి సర్కార్ రాష్ట్రాలకున్న నిర్ణయాత్మక శక్తి లేకుండా కేవలం కొద్ది సంఖ్యలో మాత్రమే పని దినాల కేటాయింపుకు తెగబడింది.

నాలుగవది: ఉపాధి హామీ చట్టం అమలులో రైతు కూలీలకు పని దినాలు తగ్గే విధంగా యంత్ర సాంకేతికతను ప్రోత్సహించడం, సామాగ్రి విడి భాగాల కొనుగోలు ఖర్చును ఈ నిధుల నుండే ఖర్చు చేయడం జరిగింది. ఈ పథకం ప్రవేశపెట్టిన కొత్తలో కేవలం పది శాతం మాత్రమే వస్తువులు విడిభాగాలకు కేటాయించారు. మిగిలిన నిధులు రైతు కూలీల జీతాలు చెల్లింపులకు వినియోగించారు కానీ నేడు అది 36 శాతానికి పెరిగింది. యంత్రాల వాడకం కూడా పెరిగింది. పర్యవసానంగా రైతు కూలీల బదులు యంత్రాలు సాంకేతికత వినియోగం పెరిగి పని దినాలు పడిపోయాయి.

ఐదవది: ఈమధ్య ఉపాధి రైతు కూలీలకు రెండు నుండి ఏడు శాతం వేతనం మాత్రమే పెంచడం కేవలం వారిని స్పష్టంగా ఈ పనులకు దూరంగా ఉంచడమే. వారి శ్రమ దోపిడీకి పాల్పడడమే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 300 నుండి 307కు పెరగగా బీహార్‌లో 245 నుండి 255కు కేరళలో 346 నుండి 349కి వారి వేతనాలు పెరిగాయి. ఈ రకమైన పెంపు చేసినప్పుడు పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని జీవన వ్యయాన్ని గమనంలోనికి తీసుకోకపోవడం సిగ్గుచేటు. ఉపాధి చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన జీతాన్ని కేంద్రం కూడా అమలు పరచాలి. కేరళ ప్రభుత్వం 800 రూపాయలు నిర్ణయించగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది చాలా తక్కువగా ఉండటం శోచనీయం.

నిధులు ఇవ్వకుండా నీరుగార్చే కుట్ర

ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం త్రైమాసిక నిధులుగా రూ.29,803 కోట్లు గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖకు విడుదల చేసింది. ఇందులో రూ.19,226 కోట్లు మాత్రమే రాష్ట్రాలకు కేటాయించింది. పనిచేసిన రైతు కూలీలకు 14 రోజుల్లోగా చెల్లింపులు జరగాలి కానీ ఇప్పటికీ లక్షలాది మందికి సకాలంలో చెల్లింపులు జరగక అవస్తలు పడుతున్న పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం పూర్తిగా కేటాయించిన నిధులను రాష్ట్రాలకు విడుదల చేయకపోవడం దారుణం. బిజెపి ఈ విధంగా నిరుపేదలపై దాడికి పూనుకోగా కొన్ని రాష్ట్రాలు గ్రామాలను పట్టణీకరించే పనిలో అత్యుత్సాహం చూపుతున్నాయి. వాటిని మున్సిపాలిటీలలో కలుపుతున్నాయి.

ఉపాధి చట్టం పట్టణాలకు వర్తించదు కాబట్టి ఆ చట్టం అమలు కొన్నిచోట్ల ప్రశ్నార్థకం అవుతున్నది. ఇది కేవలం పంచాయతీల్లోని గ్రామాలకు మాత్రమే వర్తిస్తుంది. అంటే ఇది చట్టాన్ని నీరుగార్చే కుట్రలో మరో భాగం. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ నాయకత్వంలోని ప్రభుత్వంలో అవినీతి పేరుకుపోయిందనే సాకుతో గత మూడేళ్లుగా ఆ రాష్ట్రానికి కేంద్రం ఉపాధి నిధులు విడుదల చేయడం లేదు. నిధులు ఆపి గ్రామీణ కూలీలను ఇబ్బంది పెట్టిన కేంద్రం తీరును ఇటీవల కలకత్తా హైకోర్టు తప్పుపట్టింది. ఉపాధి గ్రామీణ ప్రజల హక్కు అని తేల్చిచెబుతూ 2025 ఆగష్టు ఒకటినుంచి ప్రారంభించాలని ఆదేశాలు జారీచేసింది.


సంఘటిత ఉద్యమాలే శరణ్యం

ప్రపంచ బ్యాంకు నిబంధనల ప్రకారం మూడు డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉన్నవారు అత్యంత నిరుపేదలు. ఉపాధి హామీ చట్టం అమలు కారణంగా గ్రామీణ పేదలు అంతకన్నా ఎక్కువ ఆదాయం పొందడంతో అత్యంత నిరుపేదల లిస్టు నుండి వారు బయటపడ్డారు. కానీ ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ అమల్లోకి రావడంతో తిరిగి వారు మళ్లీ పేదరికంలోనికి నెట్టి వేయబడుతున్నారు. కేంద్రం విధానాల వల్ల నేటి గ్రామీణ భారతంలో నిరుపేదలకు, ధనస్వాములకు ఒక వైరుధ్యం ఏర్పడుతున్నది. ఈ అంతరాలను తొలగించడానికి మనం గ్రామీణ నిరుపేదల పక్షాన నిలవాలి. వారిని సంఘటిత పరిచి ముందుకు నడిపించాలి. అందుకుగాను కేంద్రం ఉపాధి బడ్జెట్‌ను రూ 2.5 లక్షల కోట్లకు పెంచేలా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవాలి. అలాగే ఏడాదికి 200 పనిదినాలు కల్పించేలా, కనీస వేతనం రూ.600గా నిర్ణయించేలా పోరాటాలు చేయాలి. అప్పుడు మాత్రమే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సంరక్షించుకోగలం. ఇది నేటి ఆవశ్యకత.



కేఎల్ రాములు, అమృత్ తెలంగాణ, సీనియర్ రిపోర్టర్ స్టేట్ బ్యూరో

## శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన పాలెపు మల్లేష్ తో పాటు పలువురు బిజెపి పార్టీ నుండి కాంగ్రెస్ లో చేరారు,




అమృత్ తెలంగాణ మల్లాపూర్ జూలై:14, మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కిషన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏలాల జలపతి రెడ్డి సమక్షంలో ఈరోజు శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన పాలెపు మల్లేష్ తో పాటు పలువురు బిజెపి పార్టీ నుండి కాంగ్రెస్ లో చేరారు, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పలు అభివృద్ధి పనులకు,పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలపడం జరిగింది. పార్టీలో చేరిన వారికి జలపతి రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు..ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్.

అమృత్ తెలంగాణ ఇబ్రహీంపట్నం జూలై:14 అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు.. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎమ్మెల్యే కోటాలో 138 మంది లబ్దిదారులుకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను స్దానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా లబ్దిదారులు పనులు ప్రారంభించుకోని ప్రభుత్వం ఇస్తున్న రుపాయలు 5 లక్షల అకౌంట్ ధ్వార పోందలన్నారు.. ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ రామకృష్ణ ఆయా గ్రామల పంచాయతీ కార్యదర్శులు,లబ్దిదారులు, బీఆర్ఏస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు...



## కెసిఆర్ హయాంలో ఆలయాలకు ప్రత్యేక నిధులు.. జోగు రామన్న

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఆధ్యాత్మికతను పెంపొందిస్తూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణాలకు ప్రభుత్వ నిధులను కేటాయించిన ఘనత కేసీఆర్ దాన్ని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీ పార్క్ లో గల భీమన్న దేవుడి ఊరేగింపులో జోగు రామన్న గారు పాల్గొన్నారు.. ఆలయ నిర్వాహకులు జోగు రామన్న గారిని ఘనంగా స్వాగతిస్తూ శాలువాతో సత్కరించారు.. అనంతరం భీమన్న దేవుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు పొందారు. జోగు రామన్న గారు మాట్లాడుతూ ఆషాడ మాసం ఆరంభంలో భీమన్న దేవుడు జాతర ఓ గొప్ప పండగల ఆనవాయితీగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు.. ప్రతి ఒక్కరికి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికం వైపు అడుగులు వేస్తూ మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలన్నారు.. భీమన్న దేవుడి ఆలయ అభివృద్ధి పనులను గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టి అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు... ఈ కార్యక్రమంలో ధారవేణి రాము, బొజ్జ సంతోష్, దార్ల రవి, నగేష్, రాజు, బొమ్మెన లక్ష్మణ్,పోచ్చన్న, కొండ ఎంకటి, గంగన్న శివయ్య నారాయణ, నాయకులు కొండ గణేష్, దమ్మపాల్, తిరుపతి దయానంద్ పాల్గొన్నారు,



## బోథ్ మోడల్ స్కూల్ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాను - బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆడే గజేందర్





అమృత్ తెలంగాణ: పట్టణంలోని స్కూల్ ను బోథ్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ పర్యటించి పలు సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. పాఠశాల ప్రిన్సిపల్ అనురాధ పలు సమస్యలను వివరిస్తూ... పాఠశాలలో ఎక్కువ మొత్తంలో విద్యార్థులు ఉండడం చేత క్లాస్ రూమ్ లు సరిపోవడం లేదని కావున బిల్డింగ్ పై భాగంలో క్లాస్ రూమ్ ల నిర్మాణం చేపట్టాలని, వాటర్ ప్యూరిఫికేషన్ మిషన్ చెడిపోయిందని, కొత్త వాటర్ ప్యూరిఫికేషన్ మిషన్ అందించాలని, పాఠశాల భవనంకు అక్కడక్కడ మరమ్మతులు చేయాలని చేయాలని పాఠశాల ప్రిన్సిపల్ కోరూతు వినతి పత్రం అందించడం జరిగింది. దీనిపై ఆడే గజేందర్ సానుకూలంగా స్పందిస్తూ గతంలో చెప్పిన వెంటనే 10 లక్షల రూపాయల రెడ్ గ్రావెల్ పోయించడం జరిగిందని గుర్తు చేస్తూ వారు చెప్పిన సమస్యలను అతి త్వరలో తీరుస్తానని పాఠశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం పాఠశాల సిబ్బంది ఆడే గజేందర్ సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ షాకీర్, గౌస్ అలీ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పశువుల వ్యాపారి వద్ద దౌర్జన్యం చేసిన ఇద్దరిపై కేసు నమోదు ఒకరి అరెస్ట్, రిమాండ్ - ఆదిలాబాద్ రెండవ పట్టణ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణాకర్ రావు.


ప్రధాన నిందితుడి పరారీ, అన్వేషణను ప్రత్యేక బృందం ఏర్పాటు.
విచారణలో ఇంకా ఎవరి హస్తము ఉన్న వారిపై చట్ట ప్రకారం చర్యలు.
ఆదిలాబాద్ టూ టౌన్ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు, విచారణ, నిందితుడి రిమాండ్.
నిజామాబాద్ పశువుల వ్యాపారి వద్ద డబ్బులు వసూలు చేసిన ముఠా.
ఆదిలాబాద్ టు టౌన్ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణాకర్ రావు తెలిపిన వివరాల ప్రకారం వివరాలలో




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి సుమారు 15-20 రోజుల క్రితం జరిగిన ఘటనకు సంబంధించి, తేదీ 14.07.2025 మధ్యాహ్నం 3:00 గంటలకు మొహమ్మద్ సలీం ఖురేషీ (వయస్సు: 48 ఏళ్లు), వృత్తి: వ్యాపారం, నివాసం: జంకంపేట్, యేడపల్లి మండలం, నిజామాబాద్ జిల్లా, ఆదిలాబాద్ టూ టౌన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొచ్చిన వివరాల ప్రకారం, పశువుల కొనుగోలు మరియు అమ్మకానికి సంబంధించిన వ్యాపారం చేస్తున్న సమయంలో, ఆదిలాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు A-1 దుర్ల సత్తన్న (గడియార్ మొహల్లా) మరియు A-2 మజార్ (ఖుర్షీద్ నగర్) అతని వ్యాపారాన్ని అడ్డుకుంటూ, డబ్బులు ఇవ్వాలని బెదిరించారని తెలిపారు. ఖుర్షీద్ నగర్ కాలనీలోని CWC గోడౌన్ సమీపంలో వాహనం ఆపి, డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని, వాహనం తీసుకుంటామని బెదిరించారని, భయంతో మజార్‌కు రూ. 30,000/-, దుర్ల సత్తన్నకు రూ. 20,000/- మొత్తంగా రూ. 50,000/- నగదు ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాక, అదే విధంగా షేక్ మాన్సూర్ (తాటిగూడ) మరియు షేక్ జావీద్ (ఆర్మూర్) అనే ఇతర వ్యాపారులనుండి కూడా డబ్బులు వసూలు చేసినట్టు ఫిర్యాదులో వెల్లడించారు. ఈ మేరకు ఇద్దరు నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దర్యాప్తులో డబ్బులు వసూలు చేసిన నిందితులలో ఇంకెవరిదైనా హస్తం ఉన్నదని తేలిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. నిందితుడికి 14 రోజుల జ్యూడిషల్ రిమాండ్ తరలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాగట్లపల్లి శివారులో చిరుత సంచారం..

ఎల్లారెడ్డిపేట: అమృత్ తెలంగాణ: మండలం రాగట్లపల్లి గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపుతోంది. గ్రామానికి చెందిన రైతు సురేష్ ఉదయం తన పొలానికి వెళ్లిన సమయంలో చిరుతపులిని చూశాడు. వెంటనే ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. విషయాన్ని తెలుసుకున్న గ్రామస్థులు భయాందోళనకు లోనవుతున్నారు. పంటపొలాల్లోకి వెళ్లడంలో రైతులు వెనుకంజ వేస్తున్నారు. సమాచారాన్ని అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. అధికారులు చిరుత అడుగుజాడలను గుర్తించారు. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ సఖారం మాట్లాడుతూ.. చిరుతపులి కోసం ఎల్లారెడ్డిపేట శివారు నుంచి వెంకటాపూర్ శివారు వరకు గాలింపు చర్యలు ముమ్మరం చేశాం. రైతులు అప్రమత్తంగా ఉండాలి. చిరుతను ఎక్కడైనా గమనించిన వెంటనే అటవీశాఖకు సమాచారం ఇవ్వాలి" అని సూచించారు. చిరుత సంచారంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్తులు, ముఖ్యంగా రైతులు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ గాలింపు చర్యలు కొనసాగుతోంది.



## చిన్నప్పటి నుంచి కష్టపడే తత్వం అలవాటు చేసుకోవాలి

వీర్నపల్లి : చిన్న నాటి నుంచి విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని నార్కోటిక్స్ ఎస్పీ భూక్య రామ్ రెడ్డి నాయక్ తెలిపారు. వీర్నపల్లి మండలం ఉమ్మడి గర్జన పల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో సోమ వారం ధూమ నాయక్ ట్రస్ట్ ద్వారా ఉమ్మడి గర్జనపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్, డైరీ లను నార్కోటిక్స్ ఎస్పీ భూక్య రామ్ రెడ్డి నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పుడు ఎదుర్కొన్న కష్టాలే ఉన్నత స్థాయిలో నిలబడేలా చేశాయని తెలిపారు. తాత్కాలిక వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దని సూచించారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టండి. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజల నుంచి ఆర్జీల స్వీకరిస్తున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్



హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి :ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూభారతి చట్ట అమలును తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలని, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను ఈ నెలాకరులోగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ ప్రక్రియ ఇప్పటికే 55 శాతం పూర్తైనట్టు తెలిపారు. మిగిలిన భాగాన్ని తక్షణమే పూర్తి చేసి, నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో రెండో దశ జ్వర సర్వే 34 శాతం పూర్తైనట్టు పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్ష కిట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, ఎంపీడీవోలు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. మండలాల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని అన్ని శాఖల పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా నిర్మల్ జిల్లా సంరక్షణ గృహాల్లో ఉండే అనాథ పిల్లలకు ప్రత్యేక ఆరోగ్యశ్రీ కార్డులు అందించామని, వీటి ద్వారా వారికి రూ. 10 లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసలు పొందిన జిల్లా మహిళా సంఘాలను కలెక్టర్ అభినందించారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలం తాండ్రా.జి గ్రామానికి చెందిన రైతు సందుపట్ల రాజేశ్వర్‌కు, మల్బరీ ఆకుల సాగుకు షెడ్ నిర్మాణానికి సిల్క్ సమగ్ర-2 పథకం కింద రూ. 4.50 లక్షల వ్యయంతో, తొలి విడతగా రూ. 93,775 సబ్సిడీ చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు వినూత్నంగా ఆలోచించి కొత్త పంటల సాగు చేసి, అధిక లాభాలు సాధించాలని సూచించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభయ ఆంజనేయ అలయంకు నిధులు మంజూరు చేయించిన ఆడే గజేందర్ ప్రత్యేక ధన్యవాదాలు - మాదాపూర్ గ్రామస్తులు



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : నేరడిగొండ మండలంలోని మాదాపూర్ లో అభయ ఆంజనేయ అలయంకు మొదటి దశలో రూ. 25 లక్షలు మంజూరు అయ్యాయి. నిధుల మంజూరు చేసిన దేవాదాయం, ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ మరియు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ గ్రామ పటేల్ పెందుర్ బండు, జగ్గుక్ సాంబన్న, పెందుర్ వెంకట్రావు, సోయం లక్ష్మణ్ మరియు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.






హాజరైన పంచాయతీరాజ్ అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో పొలం బాట రోడ్లు, గర్ల్స్ టాయిలెట్లు, గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడి కేంద్రాల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతనంగా మంజూరైన పనులను ప్రారంభించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. 512 పొలం బాట రోడ్లు (650 కిలోమీటర్లు) 34 కోట్లు, 118 బాలికల మరుగుదొడ్లకు 2.36 కోట్లు, 99 గ్రామపంచాయతీ భవనాలకు 2.36 కోట్లు, 40 అంగన్వాడి కేంద్రాల నిర్మాణాలకు 4.80 కోట్లు మంజూరై, పనులు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ శివరాం, సంబంధిత శాఖల అధికారులు అధికారులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ నేత దారుణ హత్య..



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: నాగర్ కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ నేత ఒకరు దారుణ హత్యకు గురయ్యాడు. రెండు రోజులుగా కనిపించకుండా పోయిన సదరు నేత.. చివరకు ఓ రిజర్వాయర్ లో శవమై తేలాడు. జిల్లాలోని కల్వకోల్ గ్రామంలో సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. కల్వకోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కర్నాటి దామోదర్ గౌడ్ (48) కనిపించకుండా పోయారు. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో దామోదర్ గౌడ్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు సింగోటం రిజర్వాయర్ లో మృతదేహం లభించింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

దామోదర్ గౌడ్ కు అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సదరు మహిళతో గడిపేందుకు వెళ్లాడు. దామోదర్ గౌడ్ ఆ మహిళతో సన్నిహితంగా ఉండగా.. సదరు మహిళ భర్త, కొడుకు గమనించారు. ఆగ్రహం పట్టలేక ఇద్దరిపైనా దాడి చేసి దామోదర్ గౌడ్ ను కొట్టి చంపారు. ఆ తర్వాత శవాన్ని సంచిలో మూటకట్టి తీసుకెళ్లి ఎంజీకేఎల్ కెనాల్ లో పడేశారు. రెండు రోజుల తర్వాత దామోదర్ గౌడ్ మృతదేహం సింగోటం రిజర్వాయర్ లో తేలింది. ప్రస్తుతం ఆ మహిళను, ఆమె భర్త, కుమారుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశం కలెక్టర్ మాట్లాడుతూ, కేజీబీవీ విద్యాలయాల్లో నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైకప్పుల లీకేజీలు, మరమ్మత్తులు, అదనపు మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు తదితర అంశాలపై తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులు నివేదిక అందజేయాలని సూచించారు. అవసరమైన చోట ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పనులు చేపట్టాలని, దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్షించిన కలెక్టర్, మండలాలలోని పిహెచ్‌సీలకు అనుబంధంగా సబ్ సెంటర్ల నిర్మాణంపై ప్రణాళిక రూపొందించాలన్నారు. నిర్మాణంలో ఉన్న సబ్ సెంటర్ల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, డీఈఓ రామారావు, డీఎంహెచ్ఓ రాజేందర్, కేజీబీవీ సమన్వయకర్త సలోమికరుణ,తహసీల్దార్లు, ఇంజినీరింగ్ శాఖఅధికారులు, పాల్గొన్నారు.

# జిఎంపిఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి..



భువనగిరి కలెక్టరేట్ :అమృత్ తెలంగాణ: ఈనెల 22, 23 తేదీలలో రాయగిరి గ్రామంలోని లింగ బసవ గార్డెన్లో జరిగే జిఎంపిఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలను కోరుతూ భువనగిరి మండలంలోని తాజపూర్ గ్రామంలో సంబంధిత కరపత్రాన్ని జిఎంపిఎస్ మండల అధ్యక్షులు దేవునూరి బాలయ్య, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ.. గొర్ల కాపరుల సమస్యల పరిష్కారం కోసం దశాబ్దం కాలంగా ఎన్నో ఉద్యమాలు నిర్వహించి 1016, 559 జీవోల ను తీసుకొచ్చిందన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని, నేషనల్ లైవ్ స్టాక్ విషయంలో గొల్ల కురుమలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, గొర్రె మేకల పెంపకానికి ప్రాతన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాజ్ పూర్ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం సభ్యులు ర్యాకాల నర్సింహా, బిట్కూరి రాములు, బాలడా రవి, సోమన మహేష్, దేవునూరి భాస్కర్,గులాని సురేష్ లు పాల్గొన్నారు.

# 14 లక్షల LOC అందజేసిన గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : బోథ్ మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన లాడేవార్ పార్వతి బోన్ మ్యారో సర్జరీ కొరకు హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ. 14 లక్షల LOC ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ నెరడిగొండ మండల కేంద్రంలో అందజేశారు.

# ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



భువనగిరి :అమృత్ తెలంగాణ: ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 70 అర్జీలను,జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు కలసి అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 57,జిల్లా పంచాయతీ శాఖ 3, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ 3,సర్వే ల్యాండ్స్ 2, కోపరేటివ్ , ఎలక్ట్రిసిటీ, మున్సిపాలిటీ, జిల్లా సంక్షేమ శాఖ, సివిల్ సప్లై శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థిని సంధ్య మృతిపై సమగ్ర విచారణ జరపాలి



భువనగిరి:అమృత్ తెలంగాణ: చౌటుప్పల్ మండలంలోని తూప్రాన్ పేట గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలలో సంధ్య అనే విద్యార్థి మృతి చెందడంపై మృతి పట్ల సమగ్ర విద్య జరపాలని, పాఠశాల ప్రిన్సిపాల్ హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని సంధ్య కుటుంబానికి ప్రభుత్వమే ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల రాహుల్ అన్నారు. సోమవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు కి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ మండలంలోని తూప్రాంపేట గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న సంధ్య అనే విద్యార్థి పాఠశాల భవనంపై దూకి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. విద్యార్థి మృతిపై సమగ్రమైన విచారణ చేపట్టాలని విద్యార్థులకు బిల్డింగ్ ఎక్కుతుంటే పాఠశాల వార్డెన్,వాచ్మెన్ పైన ఏం చేస్తున్నారని ప్రశ్నించడం జరుగుతుందని, సంధ్యా కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని వారి కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియో, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, మృతి పై సమగ్ర విచారణ జరపాలని అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపాల్ హాస్టల్ వార్డులపై చర్యలు తీసుకోవాలని స్థానికంగా పాఠశాలలో హాస్టల్లోవార్డెన్ ఉండకుండా కాలయాపన చేస్తున్న వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి, విద్యార్థి మృతి పైన సమగ్రమైన విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



వనపర్తి :అమృత్ తెలంగాణ: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం తో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటి కప్పుడుస్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నాం: మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ : అమృత్ తెలంగాణ: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేరుస్తుందని, ఈ దిశగా ఇప్పటికే అనేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీ భవన్‌లో స్పష్టం చేశారు. సోమవారం గాంధీభవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయపరమైన అవకాశాలను వినియోగించుకొని కుల సర్వే నిర్వహించిందని తెలిపారు.

కోర్టు ఆదేశాలు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలులో న్యాయమూర్తుల సలహాలు తీసుకొని, ప్రామాణిక సర్వే ఆధారంగా శాసనసభలో తీర్మానం చేశామన్నారు. బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసి గవర్నర్‌కు, అక్కడి నుండి రాష్ట్రపతికి పంపినట్లు వివరించారు.

బీజేపీపై మండిపడ్డ మంత్రి..

బీజేపీ జాతీయ ఓబీసీ అధ్యక్షులు లక్ష్మణ్ బీసీ రిజర్వేషన్లపై అసహనం వ్యక్తం చేయడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. బీసీల రిజర్వేషన్ల కోసమే స్థానిక సంస్థల ఎన్నికలను గత 18 నెలలుగా వాయిదా వేసుకుంటూ వస్తున్నామని, ఈ విషయంలో బీజేపీ నిధులు ఆపిందని ఆరోపించారు. బలహీన వర్గాల పట్ల బీజేపీకి ఉన్న అభిప్రాయాలు ఏమిటని ప్రశ్నించారు.

రిజర్వేషన్లను కాపాడడానికి తెలంగాణ ఉద్యమంలో అన్ని సంఘాలు జేఏసీగా ఏర్పడినట్లుగానే, ఇప్పుడు బీసీ రిజర్వేషన్లను కూడా సాధించుకుంటామని స్పష్టం చేశారు. బీజేపీ నేతలు బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే, వారి పార్టీలోనే వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బీజేపీ నేతలు తమ మాటలు వదిలిపెట్టి, రాష్ట్రపతి దగ్గరకు తీసుకువెళ్లి బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

బీసీ ముఖ్యమంత్రిపై బీజేపీకి సవాల్

"మండల్ కమిషన్ తీసుకొస్తే కమండల్ కమిషన్ తెచ్చారు" అంటూ బీజేపీపై మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీసీ ముఖ్యమంత్రి అని చెప్పుకునే బీజేపీ, బీసీ అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను తొలగించి కేసీఆర్ తాబేదార్ కిషన్ రెడ్డిని నియమించిందని ఆరోపించారు. మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు కాకుండా వేరే వారికి ఇచ్చారని, అయితే కుల గణన ద్వారానే ఐదు ఎమ్మెల్సీలు బలహీన వర్గాలకు వచ్చాయని గుర్తు చేశారు. బీజేపీ కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులు కలిసి ఢిల్లీకి వచ్చి తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.

బీజేపీ, బీఆర్ఎస్ డ్రామాలపై విమర్శలు

బీఆర్ఎస్ లో ఉన్న బలహీన వర్గాల నేతలు తమ పార్టీ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్ష పదవికి, ప్రతిపక్ష పదవికి బీసీ, ఎస్సీ, ఎస్టీలు అర్హులు కారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీలు రిజర్వేషన్లు అడ్డుపడితే, తెలంగాణ బలహీన వర్గాలు ఐక్యమై ఈ రిజర్వేషన్లు జారిపోకుండా కాపాడుకునే బాధ్యత బీసీ మేధావులు, రాజకీయ నాయకులు, కుల సంఘాలదేనని అన్నారు. తాము ఢిల్లీ రావడానికి సిద్ధంగా ఉన్నామని, తాము పంపిన ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద ఉందని, దానిని ఆమోదింపజేయాలని కోరారు. శాసనసభ రన్నింగ్‌లో లేనప్పుడు ప్రభుత్వాలకు ఆర్డినెన్స్ తెచ్చే హక్కు ఉంటుందని, రాష్ట్రపతి దగ్గర ఉన్న బిల్లుకు, ఆర్డినెన్స్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు.




కాంగ్రెస్ పార్టీయే బీసీలకు చాంపియన్

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీయే చాంపియన్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్ఘాటించారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేస్తున్నామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ లు "ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ"లాగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ నేతలు న్యాయపరమైన చిక్కులు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు బరాబర్‌గా అమలు చేస్తామని, దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ నేతలు పెరుగుతారని ధీమా వ్యక్తం చేశారు.

"బీజేపీలో బీసీ నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలి . నీకు పదవులు వస్తున్నాయి. బీసీలకు అన్యాయం చేయడానికి నీకు జాతీయ అధ్యక్ష పదవి ఇస్తానన్నా వెళ్లకండి" అంటూ బీజేపీ బీసీ నేతలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లు అమలు అయితే అన్ని రాష్ట్రాల్లో అమలవుతాయని పేర్కొన్నారు. తెలంగాణ కుల గణన విప్లవాత్మక నిర్ణయమని స్వయాన వారణాసి ప్రజా ప్రతినిధి, ఆర్ఎస్ఎస్ నేత అన్నారని గుర్తు చేశారు. తమ పార్టీలోని స్వయంసేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్ వారు కూడా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దానిని స్వాగతిస్తున్నారని తెలిపారు. న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని, తాము చేస్తున్న ప్రక్రియ తెలంగాణ సమాజానికి దిక్సూచిగా మారుతుందని చెప్పారు.

బీసీ నేతలకు అభ్యర్థన

దురాలోచన ఉన్న బుద్ధులు మారాలని అమ్మవారిని వేడుకుంటూ, 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు కావాలని ఆకాంక్షించారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, ఆర్ కృష్ణయ్య, లక్ష్మణ్ వంటి బీసీ నేతలను ఉద్దేశించి, "మీరు బీసీ బిడ్డలు. బీసీలకు అన్యాయం చేయకుండా చూడండి. కడుపులో కత్తులు పెట్టుకొని మాట్లాడకండి. ఫ్యూడలిస్ట్ సిద్ధాంతాలతో అడ్డుపడకండి" అని అభ్యర్థించారు. తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లు అమలు కావడానికి ప్రధాన మంత్రిని కలవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్రపతిని ఉద్దేశించి "మేము అభ్యర్థిస్తున్నాం, రాష్ట్రపతి ని మీరు రిజర్వేషన్ క్యాటగిరీ తల్లి. గవర్నర్ పంపిన చట్టాన్ని ఆమోదించండి తల్లి" అని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయాలు వద్దని, ఎంపీరికల్ డేటా సమాచారం ఉంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని ఈడబ్ల్యూఎస్ విషయంలో కోర్టులు తీర్పులు ఇచ్చాయని గుర్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ కోసం 50 శాతం కోటా ఎత్తేసినప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కోటా ఎందుకు ఎత్తేయరని ప్రశ్నించారు. ఏ రాజకీయ పార్టీ బీసీలకు రిజర్వేషన్లు రాకుండా అడ్డుపడుతున్నారో గమనించాలని కోరారు.

# వేములవాడలో కూల్చివేత పనులను పరిశీలించిన కలెక్టర్



వేములవాడ :అమృత్ తెలంగాణ: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో నిర్మాణాల కూల్చివేత పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. తిప్పాపూర్ ఆర్టీసీ బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న పలు నిర్మాణాలను అధికారులు సోమవారం ఉదయం కూల్చి వేయిస్తుండగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. రోడ్డు నిర్మాణంతో భక్తులు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఠాణాను తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ

గంగాధర : అమృత్ తెలంగాణ: గంగాధర మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను కరీంనగర్ అడిషనల్ డీసీపీ భీమ్ రావ్ తనిఖీ చేశారు. గంగాధర పోలీస్ స్టేషన్ భవనం ఏ సంవత్సరంలో నిర్మించారు, క్రైం వెహికిల్స్, ప్రమాదానికి గురైన వాహనాలు, స్టేషన్ లో అమలు చేస్తున్న 5 ఎస్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా స్టేషన్ రికార్డ్స్ పరిశీలించిన అడిషనల్ డీసీపీ పోలీస్ క్వార్టర్స్ ఉపయోగం, పోలీస్ స్టేషన్ కి నీరు, కరెంటు సరఫరా తీరుపై ఆరా తీశారు. సీసీటీవీల పనితీరు, మొక్కల పెంపకం, స్టేషన్ కి కేటాయించిన ప్రాపర్టీ వివరాలు, పోలీసు వాహనాల పని తీరు, వంటి అనేక అంశాలపై ఆరా



తీసి వివరాలు తెలుసుకున్నారు. అడిషనల్ డీసీపీ తనిఖీ సమదర్భంగా గంగాధర ఎస్సై వంశీ క్రిష్ణ, ఆర్ఎస్ఐ తిరుపతి, ఏఎస్ఐ మల్లేశం, భగవాన్ రెడ్డి పాల్గొన్నారు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# జాన్వీకపూర్ కి మళ్లీ షాక్ ఇచ్చిన యూనిట్!



ఆ సినిమా విడుదల వాయిదాతో జాన్వీ కపూర్ ఇబ్బంది పడుతోందా? కొత్త ఏడాది ఆరంభంలోనే అమ్మడికి ఇక్కట్లు తప్పడం లేదా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది ఆ సినిమా విడుదల వాయిదాతో జాన్వీ కపూర్ ఇబ్బంది పడుతోందా? కొత్త ఏడాది ఆరంభంలోనే అమ్మడికి ఇక్కట్లు తప్పడం లేదా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. ప్రస్తుతం జాన్వీ కపూర్ లో బాలీవుడ్ లో 'పరమ్ సుందరి', 'సన్నీ సంస్కారీకి తులసీ కుమారీ'లో నటిస్తోంది. వీటితో పాటు తెలుగులో రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న 16వ చిత్రంలోనూ నటిస్తోంది. అయితే ఏప్రిల్ లో రిలీజ్ కావాల్సిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారీ' మరోసారి వాయిదా పడింది. అనుకున్న టైమ్ లో షూటింగ్ పూర్తి కాకపోవడంతో వాయిదా వేసారు. ఈ సినిమా ఇంకా 25 రోజులు షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంది. దీంతో ఈ సినిమా ఎప్పుడు షూటింగ్ పూర్తవుతుంది? ఎప్పుడు రిలీజ్ అవుతుంది? అన్న దానిపై మరోసారి నీలి నీడలు కమ్ముకున్నాయి. అయితే ఈ సినిమా ఇలా వాయిదా పడటం కారణంగా జాన్వీ కి ఇతర సినిమాలతో డేట్లు క్లాష్ అవుతున్నాయట. ముఖ్యంగా రామ్ చరణ్ తో నటిస్తోన్న సినిమా షూటింగ్ కి అంతరాయం ఏర్పడుతుందట. జాన్వీ కపూర్ 25 రోజుల్లో 15 రోజుల పాటు కంటున్యూగా షూటింగ్ కి హాజరవ్వాల్సి ఉందట. అయితే చరణ్ సినిమాకి కేటాయించిన డేట్లలోనే ఈ 15 రోజులు కూడా క్లాష్ కి వస్తున్నాయట. దీంతో జాన్వీ కపూర్ కి ఏం చేయాలో అర్దం కాని సందిగ్దంలో పడిందంటున్నారు. ఒకే సమయంలో ముంబై టూ హైదరాబాద్ తిరగడం సాధ్యం పడదు. రెండు సినిమాల షూటింగ్ ఒకే చోట అయితే ఇబ్బంది ఉండదు 'సన్నీ సంస్కారీ కి తులసీ కుమారి' షూటింగ్ లను ఇప్పటివరకూ అలాగే బ్యాలెన్స్ చేసుకుంటూ వచ్చింది. కానీ రామ్ చరణ్ సినిమా షూటింగ్ హైదరాబాద్ లో జరుగుతుంది కాబట్టి వీలు పడదు. ఈ నేపథ్యంలో డేట్లు క్లాష్ అవ్వకుండా చరణ్ మేకర్స్ నో, హిందీ సినిమా వాళ్లనే సర్దుబాటు చేయమని అడగాల్సిన పరిస్థితి. డిలే కారణంగా వాయిదా వేసారు కాబట్టి ఈ విషయంలో బాలీవుడ్ మేకర్సే వెనక్కి తగ్గాల్సి ఉంటుంది. ఇప్పటికే చరణ్ సినిమాకి సంబంధించి జాన్వీ షెడ్యూల్ ఫిక్స్ అయింది.

# టెంపర్ బ్యూటీ మరణ వార్తలు.. అసలు మ్యాటర్ ఇదే!

నోరా ఫతేహి గురించి తెలుసుకునేందుకు చాలా మంది ఆమెను సోషల్ మీడియా ద్వారా పలకరించారు. పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా బంగీ జంపింగ్ చేసేందుకు ప్రయత్నించిన నోరా ఫతేహి ప్రమాదవశాత్తు మరణించింది అంటూ సోషల్ మీడియాలో పుకార్లు వచ్చాయి. అందుకు సంబంధించిన ఒక వీడియో సైతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అడవిలో చేసిన ఆ జంపింగ్ సమయంలో ప్రమాదం జరిగి మహిళ కింద పడ్డట్టుగా వీడియోలో ఉంది. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి నోరా ఫతేహి అన్నట్లు అనిపిస్తుంది. దాంతో ఆమె ఫ్యాన్స్‌తో పాటు నెటిజన్స్ అంతా షాక్ అయ్యారు. నోరా ఫతేహి గురించి తెలుసుకునేందుకు చాలా మంది ఆమెను సోషల్ మీడియా ద్వారా పలకరించారు దుల్లగొడుతున్నాం ప్రమాదం జరిగినట్లు చూపించిన వీడియో మార్ఫింగ్ అయ్యి ఉంటుందని మొదటి నుంచి కొందరు అంటున్నా, అలా చేయాల్సిన అవసరం ఎవరికి ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తంగా ఎన్టీఆర్ టెంపర్ సినిమాలో ఐటెం సాంగ్ చేసి తెలుగు ప్రేక్షకులకు సైతం సుపరిచితురాలైన బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి చనిపోయిందనే వార్తలు ప్రముఖంగా వచ్చాయి. కొన్ని గంటల్లోనే వార్తలు దావానంలా వ్యాప్తి చెందడంతో వెంటనే ఆమె టీం స్పందించింది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మవద్దు అంటూ వారు పేర్కొన్నారు. ఆ వీడియోలో ఉన్నది నోరా కాదని వారు క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం నోరా ఫతేహీ తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకుంటుంది. సోషల్ మీడియా ద్వారా తన పుట్టిన రోజుకు సంబంధించిన ఫోటోలను వీడియోలను షేర్ చేస్తూ వచ్చింది. దాంతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నిజం కాదని మరోసారి క్లారిటీ వచ్చింది. కొందరు కావాలని ఆ వీడియోను మార్ఫింగ్ చేశారని, అలాంటి పనులు చేయడం ద్వారా సెలబ్రెటీల అటెన్షన్ దక్కించుకోవచ్చు అని భావిస్తున్నారేమో. కానీ పుకార్లను వ్యాప్తి చెందించడం ద్వారా సదరు సెలబ్రెటీ ఫ్యాన్స్, సన్నిహితులు ఎంతో ఆందోళనకు గురి అవుతారనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది కెనడాలోని టొరంటోలో పుట్టిన నోరా ఫతేహి బాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి సక్సెస్‌లను దక్కించుకుంది. మొరాకో





సంతతికి చెందిన ఫ్యామిలీలో పుట్టిన నోరా ఫతేహి యార్క్ విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రంలో అంతర్జాతీయ సంబంధాలను అభ్యసించి గ్రాడ్యుయేషన్ దక్కించుకుంది. బాలీవుడ్‌లో సినిమాలతో అలరించిన నోరా చాలా సార్లు తాను భారతీయురాలిని అనే భావన కలుగుతుందని చెప్పుకొచ్చింది. బిగ్ బాస్ 9లో పాల్గొనడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. ప్రస్తుతం కాంచన 4 సినిమాతో పాటు మరో రెండు మూడు సినిమాల్లో నటిస్తోంది. తెలుగు ప్రేక్షకులకు ఐటెం సాంగ్స్‌తో చేరువ అయిన నోరా ఫతేహీ టాలీవుడ్‌లో ముందు ముందు మరిన్ని సినిమాల్లో నటించాలని కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చింది.

# చెప్పుతో కొట్టాల్సింది.. 'దంగల్' నటికి నిర్మాత సలహా!

అయితే టాలీవుడ్ లో కాస్టింగ్ ఏజెంట్లు 'ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నావా?' అని పదే పదే రెచ్చగొట్టారని ఫాతిమా వ్యాఖ్యానించారు. 'దంగల్' ఫేం ఫాతిమా సనా షేక్ దక్షిణాదిన తనకు కాస్టింగ్ కౌచ్ ఎదురైందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో నిర్మాతను చెప్పుతో కొట్టాల్సిందని తెలుగు నిర్మాత ముత్యాల రాందాస్ అన్నారు. కమిట్ మెంట్ అడిగిన నిర్మాతను నిలదీయాల్సిందని, చెప్పుతో కొట్టి, ఆ తర్వాత వేధింపుల నిరోధక కమిటీకి ఫిర్యాదు చేసి ఉండాల్సిందని రాందాస్ అన్నారు. తెలుగు సినీపరిశ్రమలో లైంగిక వేధింపుల అంశంలో బాధితుల తరపున కమిటీలు పని చేస్తున్నాయని కూడా ముత్యాల రాందాస్ తెలిపారు. ఆమిర్ ఖాన్ 'దంగల్' చిత్రంతో ఆరంగేట్రం చేసిన ఫాతిమా సనా షేక్, టాలీవుడ్‌లో కాస్టింగ్ కౌచ్ గురించి కొన్ని సంచలన వ్యాఖ్యలు చేసారు. ఫాతిమా బాలీవుడ్ బబుల్ తో మాట్లాడుతున్న ఇంటర్వ్యూ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దక్షిణాది నిర్మాతలు, కాస్టింగ్ ఏజెంట్లతో తన అనుభవాలను షేర్ చేసుకుంది. తాను బాలీవుడ్ లో అడుగుపెట్టక ముందు అవకాశాల కోసం తొలిగా దక్షిణాదిన ప్రయత్నించానని, అక్కడ నటిస్తే బాలీవుడ్ లో అవకాశాలు సులువుగా వస్తాయని ఆశించానని ఫాతిమా అన్నారు. మరో మసాలా సినిమాకి సీక్వెల్! అయితే టాలీవుడ్ లో కాస్టింగ్ ఏజెంట్లు 'ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నావా?' అని పదే పదే రెచ్చగొట్టారని ఫాతిమా వ్యాఖ్యానించారు. నేను కష్టపడి పనిచేస్తానని, పాత్రకు అవసరమైనది చేస్తానని వారికి చెప్పానని తెలిపింది. అయినా కాస్టింగ్ ఏజెంట్ పదే పదే అదే విషయం రిపీట్ చేసాడు. నేను మూగదానిని అయిపోయాను అని ఫాతిమా అన్నారు. హైదరాబాద్ లో పెద్ద, చిన్న నిర్మాతలు కాస్టింగ్ కౌచ్ గురించి చాలా బహిరంగంగా మాట్లాడుతారని తెలిపింది.

# నేను ఇడ్లీ బ్యూటీని..మూడు పూటలైనా నో ప్రాబ్లమ్!



సంవత్సరాలుగా సినిమాలు సెట్స్ లో షూటింగ్ దశలోనే ఉన్నాయి. నిధి అగర్వాల్ కెరీర్ లో నెమ్మదిగా సాగుతోన్న సంగతి తెలిసిందే. చెప్పుకోవడానికి చేతిలో 'హరి హర వీరమల్లు', 'రాజాసాబ్' లాంటి అగ్ర హీరోల చిత్రాలున్నా? వాటి రిలీజ్ విషయానికి వచ్చే సరికే ఏం చెప్పాలో తెలియని పరిస్థితి. సంవత్సరాలుగా సినిమాలు సెట్స్ లో షూటింగ్ దశలోనే ఉన్నాయి. ఆ ప్రాజెక్ట్ లపై నిధి చాలా ఆశలు పెట్టుకుంది. వాటితో సక్సెస్ అందుకుని బిజీ భామగా మారాలని చూస్తోంది. మరి ఈ ప్రయత్నం ఎంత వరకూ సక్సెస్ అవుతుందో చూడాలి. ఏం జరుగుతుంది? రెండు సినిమాలపై అంచనాలైతే భారీగా ఉన్నాయి. సక్సెస్ అయితే నిధి కి కలిసొచ్చే అవకాశాలు ఎక్కువ గానే ఉన్నాయి. ఆ సంగతి పక్కన బెడితే తాజాగా నిధి అగర్వాల్ కి ఇడ్లీ అంటే ఎంత ఇష్టమో ఎంత ఇష్టమో బయటకు వచ్చింది. ఆహార పదార్ధాల్లో ఏది ఇష్టం అంటే? అమ్మడు వెంటనే ఇడ్లీ అని సమాధానం ఇచ్చింది. ఇడ్లీ ఉదయమే కాదు..మధ్యాహ్నం లంచ్ లో ...రాత్రి డిన్నర్ లో పెట్టినా ఇష్టంగా ఆరగిస్తుందిట. ఇంట్లో ఇడ్లీ ఉంటే ఇంకే పదార్ధాలు అవసరం లేదుట. మూడు పూటలు ఇడ్లీ తినేసి సంతోషంగా ఉంటానంటోంది. సాధారణంగా ఇడ్లీ అంటే చాలా మంది ఇష్టడరు. కానీ నిధి అగర్వాల్ మాత్రం అలాంటి వాళ్లకు భిన్నం అంటోంది. ఇడ్లీ ఆరోగ్యానికి మంచిందంటోంది. ఇడ్లీ ఎక్కడ చూసినా నోరూరిపోతుందిట. ఇడ్లీ తర్వాత ఫ్రెంచ్ ఫ్రైస్ వీక్ నెస్ గా చెప్పుకొచ్చింది. డైటింగ్ వల్ల వాటికి దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు చాలా బాధపడుతుందిట.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com